సాక్షి జగిత్యాల

శుక్రవారం । 10 । ఫిబ్రవరి । 2023



నృసింహుని సన్నిధిలో రద్దీ

సారంగాపూర్ : జిర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహ స్వామి జాతర బ్రహ్మోత్సవాలకు భక్తులు పోటె త్తారు. శుక్రవారం జాతర నిర్వహిస్తారు.



పనుల పరిశీలన

కోరుట్లరూరల్: మాదాపూర్ హైస్కూల్‌లో చేపట్టిన మన ఊరు.. మన బడి పనులను అదనపు కలెక్టర్ మకరంద పరిశీలించారు.

గరిష్టం/కనిష్టం

33.0/16.0

వాతావరణం

గాలిలో తేమశాతం తగ్గుతుంది. వాతావ రణం పొడిగా ఉంటుంది. పగలు ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మోసాలపై అప్రమత్తం



మాట్లాడుతున్న న్యాయమూర్తి నీలిమ

జగిత్యాలజోన్: సమాజంలో జరిగే మోసాలపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసేందుకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కృషి చేస్తోందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ అన్నారు. జిల్లా ప్రధాన కోర్టులో గురువారం జడ్జి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సాంకేతికత వృద్ధి చెందుతున్న కొద్దీ మోసాలు పెరుగుతున్నాయన్నారు. అమాయకులు అన్నింటా మోసపోతున్నారని తెలిపారు. వారిని చైతన్యవంతం చేసేందుకు గ్రామాలు, కళాశాలల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. కోర్టుల్లో పెండింగ్ కేసులు పెరుగుతున్నాయని, కక్షిదారులకు సత్వర న్యాయం అందించడం కోసం 2018కు ముందు ఉన్న, 2023 చివరి నాటికి పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కరించేందుకు జడ్జిలు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి కంచ ప్రసాద్ మాట్లాడుతూ, జిల్లాలో ఈనెల 11వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. ఇందులో రాజీ చేసుకోదగ్గ కేసులు 1,039 వరకు ఉన్నాయని, కక్షిదారులకు ఇప్పటికే వీటిపై నోటీసులు జారీచేశామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి



మాట్లాడుతున్న సదానంద్

జగిత్యాల: పండిత, పీఈటీలకు పదోన్నతులు కల్పించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానంద్ కోరారు. జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తక్షణమే ఎఫ్ఎల్ పోస్టులు మంజూరు చేయాలని, ప్రపంచ తెలుగు మహాసభల్లో సీఎం ఇచ్చిన హామీ వెంటనే అమలు చేయాలని కోరారు. ఎస్జీటీగా పనిచేస్తూ డీఎస్సీ ద్వారా ఎస్ఏగా నియామకమైతే ఎస్జీటీ సర్వీస్‌కు ఎంటైటిల్ పాయింట్లు ఇవ్వాలన్నారు. సీనియారిటీ జాబితా తయారీలో నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు. ప్రభుత్వ పలుకుబడి బదిలీలు వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు బైరం హరికిరణ్, నాయకులు శివరాంకృష్ణ, రాజ్‌కిరణ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



ఈశ్వరయ్య

జగిత్యాల: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అలిశెట్టి ఈశ్వరయ్యను నియమించారు. ఈమేరకు గురువారం ఉత్తర్వులు జారీఅయ్యాయి. పట్టణానికి చెందిన ఈశ్వరయ్య.. బీసీ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ఆయన నియామకంపై రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ హర్షం వ్యక్తం చేశారు.

భారత్ సంస్కృతి బాగుంది



అన్నేబజీని సన్మానిస్తున్న ఉపన్యాసకులు

మెట్‌పల్లి(కోరుట్ల): భారతదేశం సంస్కృతి, సంప్రదాయాలపై తనకు మంచి అవగాహన వచ్చిందని ఫ్రాన్స్ దేశస్తురాలు అన్నేబజీ వెల్లడించారు. లోహ శాస్త్ర పరిశోధనలో భాగంగా ఆమె పలు జిల్లాలు పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను గురువారం ఆమె సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. నేర్చుకోవాలనే తపన, జిజ్ఞాస ఉంటే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. చరిత్రకారుడు ఎస్.జైకిషన్ మాట్లాడుతూ 65ఏళ్ల వయసులో చరిత్ర–పరిశోధనపై ఆసక్తి కలిగి ఉండడం అన్నేబజీ జిజ్ఞాసకు నిదర్శనమన్నారు. ప్రిన్సిపాల్ చంద్రశేఖర, ఉపన్యాసకులు రాజేందర్, మనోజ్, వెంకయ్య, మధుబాబు, గట్టయ్య, అంజయ్య, గణేశ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులదే ప్రధానపాత్ర

జగిత్యాల: విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులదే ప్రధానపాత్ర అని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. గురువారం పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడారు. ప్రతినిధులు అమరనాథ్‌రెడ్డి, శ్రీధర్, కృష్ణ, శ్రీనివాస్ ఉన్నారు.

గల్లీ పోరలు .. గంజాయి ప్రియులు!

యువతకు పార్ట్ టైం జాబ్‌గా మారిన గంజాయి సరఫరా

'ఇటీవల కరీంనగర్ తెలంగాణ చౌక్ సమీపంలోని వీధుల్లో గంజాయి విక్రయిస్తున్న ఓ హాస్టల్‌కు చెందిన ఇంటర్, డిగ్రీ విద్యార్థులను పోలీసులు పట్టుకున్నారు. అనంతరం వారి గదుల నుంచి కిలో గంజాయి, కొన్ని వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. అందులో చిన్న గ్రైండర్, వెయింగ్ మెషిన్, సిగరెట్ పేపర్, ప్యాకింగ్ పేపర్ తదితరాలు లభ్యమయ్యాయి. వాటిని చూసి పోలీసులు అవాక్కయ్యారు. ఇతర ప్రాంతాల నుంచి కిలోల లెక్కన కొనుగోలు చేసిన గంజాయిని గ్రాముల్లోకి మార్చి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీనిపై పోలీసులు తీవ్రంగా స్పందించారు. వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ చేసి పంపారు. అందులో రిపీటెడ్ అఫెండర్స్ (పదే పదే నేరాలు చేసేవారు)ని మాత్రం రిమాండ్‌కు తరలించారు.'

- కరీంనగర్ పాతబజార్‌లో దాదాపు 20 మందికిపైగా డ్రగ్స్ పెడ్లర్లు
- పాకెట్‌మనీ కోసం విద్యార్థుల అడ్డదారులు
- జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్లలో చాపకింద నీరులా దందా
- సోషల్ మీడియా వేదికగా గంజాయి కొంటున్న యువత
- ఉత్తరాంధ్ర, భద్రాచలం నుంచి కిలోల కొద్దీ అక్రమ రవాణా
- ప్రైవేటు హాస్టళ్ల గదుల్లోనే గంజాయి ప్యాకింగ్
- యంత్రాలన్నీ ఆన్‌లైన్‌లోనే ఆర్డర్ చేసుకుంటున్న వైనం



జగిత్యాలలో పోలీసులు పట్టుకున్న గంజాయి (ఫైల్)

2022లో నమోదైన గంజాయి కేసులు

జిల్లా	కేసులు	పట్టుబడిన గంజాయి	నిందితుల సంఖ్య
కరీంనగర్	22	33.919 కిలోలు	59
సిరిసిల్ల	15	3.509కిలోలు	51
జగిత్యాల	11	17.620కిలోలు	32
రామగుండం	13	8.32 కిలోలు	20



గ్రైండర్ వెయింగ్ మెషిన్

గంజాయ్ పొట్లాలు, గమ్‌పేపర్స్



పాతబజార్‌లో అనుమానాస్పద యువకులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: సాధారణంగా ఒకప్పుడు గంజాయిని ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలు ఉత్తరాది నుంచి తీసుకువచ్చేవారు. కానీ, కరోనా తరువాత వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ఫలితంగా భద్రాచలం, చత్తీస్‌ఘడ్, ఉత్తరాంధ్ర ఏజెన్సీ ఏరియాల్లో గంజాయి సాగు పెరిగింది. ఈ పరిణామం రెండు రాష్ట్రాల్లో గంజాయి అక్రమ రవాణా పెరుగుదలకు కారణమైంది. దీన్ని వినియోగించుకుని అనతికాలంలో ఎదిగేందుకు కరీంనగర్ పాతబజార్ ఏరియాలోని కొందరు యువకులు సిద్ధపడ్డారు. ఒకరిని చూసి ఒకరు దాదాపు 20 మంది వరకు ఇక్కడ పెడ్లర్లుగా మారినట్లు సమాచారం. వీరంతా భద్రాచలం ఏరియా నుంచి ఐదారు కిలోల వరకు బైకుల మీద వెళ్లి కొంటారు. కిలోకు రూ.మూడు వేల వరకు వెచ్చించి.. తరువాత వాటిని 50 గ్రాముల పాకెట్లలోకి మార్చి రూ.300 నుంచి రూ.700 వరకు విక్రయిస్తున్నారు. ఒకసారి సరుకు తీసుకొచ్చి.. నెలలో రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు. వీరు తయారు చేసే సిగరెట్లకు ఇక్కడ బాగా డిమాండ్ ఉంది. సాధారణంగా మెట్రో నగరాల్లో హషీష్ (గంజాయి నుంచి తీసే నూనె)ను సిగరెట్లలో నింపి వాడతారు. కానీ.. ఇక్కడ విద్యార్థులు ప్రత్యేక పేపర్‌తో సిగరెట్లు తయారు చేసి విక్రయిస్తున్నారు.

విలాసాల కోసమే.. అడ్డదారులు..!

నగరంలో గంజాయి సరఫరా చేసే యువకుడు ఎందుకు ఇలా చేస్తున్నావని ప్రశ్నించినప్పుడు తనకు గంజాయి అలవాటు లేదని.. కేవలం స్మార్ట్ ఫోన్ మెయింటనెన్స్.. తన గర్ల్‌ఫ్రెండ్‌ను బైకు మీద తిప్పేందుకు పాకెట్ మనీ కోసం ఇలా చేశానని.. ఇంకెప్పుడూ ఇలా చేయనని కాళ్లావేళ్లా పడటం చూసి పోలీసులు అవాక్కయ్యారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు, కొందరు డ్రైవర్లు కూడా ఇదే బాటపట్టారు. కేవలం తక్కువ కాలంలో ఎక్కువ సంపాదించవచ్చన్న కారణంతోనే వీరంతా ఇలా గంజాయి స్మగ్లర్ల అవతారమెత్తుతున్నారని పోలీసులే చెబుతున్నారు.

- పాత బజార్‌తోపాటు, కొందరు విద్యార్థులు బైకుల మీదనే వరంగల్ మీదుగా భద్రాచలం వెళ్లి సరుకు తెస్తున్నారని సమాచారం. తిరిగి వచ్చాక.. హాస్టల్ గదుల్లో తమ వద్ద ఉన్న గ్రైండర్‌తో గంజాయి ఆకులను నూరుతున్నారు. ఆ చూర్ణాన్ని వెయింగ్ మెషిన్‌తో 50 లేదా 100 గ్రాముల ప్యాకెట్లలో నింపుతారు. అనంతరం గమ్‌పేపర్లతో సిగరెట్లుగా చుడుతున్నారు.
- వీరు వాడే గ్రైండర్, గమ్‌పేపర్, వెయింగ్ మెషిన్ మొత్తం ఆన్‌లైన్‌లోనే ఆర్డర్ చేసుకున్నట్లు తెలుసుకున్న పోలీసులు ముక్కున వేలేసుకున్నారు.
- గంజాయి విక్రయం అంత ఆషామాషీ కాదు. కేవలం నమ్మకస్తులకే అమ్మాల్సి ఉంటుంది. అందుకే అమ్మే ముందు ఇన్‌స్టా, వాట్సాప్ ద్వారా లొకేషన్లు షేర్ చేసుకుంటున్నారు.
- కరీంనగర్ ఎడ్యుకేషన్ హబ్‌గా ఉంది. ఇక్కడ అనేక ప్రైవేటు, ప్రభుత్వ విద్యా సంస్థలు ఉన్నాయి. కోచింగ్ సెంటర్లతో యువత నిరంతరం హాస్టళ్లలో ఉంటున్నారు. వీరందరినీ పాత బజార్‌కు చెందిన పెడ్లర్లు లక్ష్యంగా చేసుకుంటున్నారు.
- పాత బజార్ ఎంతగా ప్రాచుర్యం పొందిందంటే.. గంజాయి కొనేందుకు జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల నుంచి విద్యార్థులు వీరిని ఆశ్రయిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. వీరితోపాటు గంజాయి పెడ్లర్లుగా మారిన వారిలో జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి నుంచి ఉన్నత విద్యకోసం వచ్చిన విద్యార్థులు కూడా ఉండటం గమనార్హం.
- జగిత్యాల, పెద్దపల్లి నుంచి కూడా పెద్ద ఎత్తున గంజాయి రవాణా జరుగుతోంది. గతవారం జగిత్యాలో పోలీసులు అంబులెన్స్‌లో రాజస్తాన్‌కు తరలిస్తున్న 70 కిలోల గంజాయిని పట్టుకున్న సంగతి తెలిసిందే. ఇక చత్తీస్‌ఘడ్, మహారాష్ట్రలకు సమీపంలో ఉన్న రామగుండం కమిషరేట్ లోనూ గంజాయి గుప్పుమంటూనే ఉంది. ఇతర రాష్ట్రాల కూలీల ద్వారా రామగుండంలోకి వస్తున్నప్పటికీ... స్థానికులు కూడా వ్యసనానికి బానిసవడం ఆందోళన కలిగిస్తోంది.

గంజాయిపై ఉక్కుపాదం



నగరంలో గంజాయి విక్రయించే వారిపై ప్రత్యేక దృష్టి సారించాం. నగరంలోని అన్ని పోలీస్‌స్టేషన్ల వారీగా విక్రయదారులను గుర్తించి, నిరంతరం నిఘా పెడుతున్నాం. కమిషనరేట్ పరిధిలో గంజాయి విక్రయించినా, సేవించినా కేసులు నమోదు చేస్తాం. అంతే కాకుండా విద్యాసంస్థలతో కలిసి విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నాం. ఇలాంటి కేసుల్లో ఇరుక్కుంటే ప్రైవేటు జాబులు కూడా రావన్న సంగతి విద్యార్థులు గుర్తించాలి.

– సుబ్బారాయుడు, సీపీ, కరీంనగర్

మనిషి మృగమైపోతాడు



గంజాయికి అలవాటు పడినవారు మృగాలవుతారు. మెదడులో అనేక మార్పులు వస్తాయి. గంజాయి కోసం తహతహలాడతారు. గంజాయి కొనేందుకు చోరీలు, నేరాలకు పాల్పడతారు. వారికి వావీవరసలు ఉండవు. ఆడవాళ్లు ఒంటరిగా దొరికితే ఎలాంటి అఘాయిత్యానికైనా పాల్పడతారు. హింసాత్మక ప్రవృత్తి పెరిగిపోతుంది. దాడులు చేసేందుకు వెనకాడరు. తల్లిదండ్రుల ప్రవర్తనలో తేడాలు కనిపిస్తే.. వెంటనే అప్రమత్తమవాలి. హాస్టళ్లలో చదువుకునే పిల్లలపైనా ఎప్పటికపుడు కన్నేసి ఉంచాలి. మెమొరీలాస్, నిద్రలేమీ, అంతర్గత అవయవాలు దెబ్బతిని త్వరగా మరణిస్తారు. – డాక్టర్ వీరేందర్, సైకాలజిస్ట్

అవ్వా.. గోళీలిస్తున్నారా..?

వైద్య పరీక్షలు చేస్తున్నారా..! కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



పేషెంట్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

గురువారం మధ్యాహ్నం 12.15 గంటలు

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి

- సర్కారు ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ
- వైద్యుల గైర్హాజరుపై ఆగ్రహం
- రిజిష్టర్‌లో రిమార్క్
- విచారణకు ఆదేశం

జగిత్యాల: కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఆకస్మికంగా ఆస్పత్రికి చేరుకున్నారు. తొలుత వరండాలోని పేషెంట్ల వద్దకు వెళ్లారు. 'అవ్వా.. గోళీలు ఇస్తున్నారా.. వైద్యం మంచిగా చేస్తున్నారా? పరీక్షలు చేశారా?' అని ఓ మహిళను ప్రశ్నించారు. పరీక్షలు చేస్తలేరనడంతో అవసరమైన పరీక్షలు చేయాలని డాక్టర్లను ఆదేశించారు.

హాజరు తీరు పరిశీలించి..

- ఆస్పత్రి సూపరింటెండెంట్ గదికి నేరుగా చేరుకున్న కలెక్టర్.. హాజరు తీరు పరిశీలించారు.
- కొందరు డాక్టర్లు సీఎల్ వేసి, గైర్హాజరు కావడంతో ఆర్ఎంవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు.
- ఆ వైద్యులు ఎందుకు రాలేదని, సీఎల్స్ ఎలా వేశారని ఆయనను ప్రశ్నించారు.
- అత్యవసర పనులు ఉండడంతో వెళ్లారని సమాధానం ఇవ్వడంతో.. తక్షణమే విచారణ చేపట్టాలని ఆదేశించిన కలెక్టర్.. రిజిష్టర్‌లో రిమార్క్ రాశారు.
- ఆగమేఘాలపై స్పందించిన ఆర్ఎంవో.. అన్ని విభాగాల వైద్య నిపుణుల గదులకు రిజిష్టర్లు పట్టుకుని కలెక్టర్‌ను తీసుకెళ్లారు. ఒకేగదిలో వైద్యులందరూ కూర్చుని ఉండడాన్ని గుర్తించిన కలెక్టర్..' ఏమైనా మీటింగ్ పెట్టుకున్నారా.. చికిత్స చేసేందుకు వచ్చారా.. ఎవరి డ్యూటీ వారు చేయాలి' అని హెచ్చరించారు.



హాజరు రిజిష్టర్‌లో రిమార్క్ రాస్తున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

అత్యవసర వార్డులో..

ఎమర్జెన్సీ వార్డులోకి వెళ్లిన కలెక్టర్.. ఒక్కో పేషెంట్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి ఎందుకు వచ్చావని ఓ మహిళను ప్రశ్నించగా.. జ్వరంతో వచ్చానని బదులిచ్చింది. ఆమెకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించారు. 'మీకు భార్య, పిల్లలు ఉంటారు.. తాగడం మానేయండి' అని కల్లు తాగి పలు ఇబ్బందులు పడుతూ వచ్చిన పేషెంట్‌కు సూచించారు. పురుగుల మందుతాగి చికిత్స పొందుతున్న మరో వ్యక్తి వద్దకు వెళ్లిన కలెక్టర్.. సమస్యలు అందరికీ ఉంటాయని, ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. ఇలాంటి వారికి కౌన్సెలింగ్ ఇచ్చేందుకు వెంటనే సైకాలజిస్ట్‌ను నియమించాలని ఆదేశించారు. మరో



ఆహారం నాణ్యత తనిఖీ చేస్తూ..

ఎమర్జెన్సీ వార్డులోకి వెళ్లిన కలెక్టర్.. బెడ్‌షీట్స్‌ను తరచూ మార్చాలని వైద్యులను ఆదేశించారు. పేషెంట్లకు అవసరమైన ఔషధాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం, జాప్యం చేయొద్దని డ్రగ్స్ స్టోర్స్ నిర్వాహకులకు సూచించారు. పనిచేయని వాటర్ ట్యాంక్‌లను తక్షణమే మరమ్మతు చేయాలని కలెక్టర్ చెప్పారు. అయితే, ఆరోగ్యశ్రీ నిధులు వెచ్చించి పనులు చేయిస్తామని బాధ్యులు కలెక్టర్‌కు బదులిచ్చారు. కొత్త వైద్యపరికరాలు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. మధ్యాహ్నం 1.20 గంటల వరకు ఆస్పత్రిలో ప్రతీ గది తనిఖీ చేసిన కలెక్టర్.. మరోసారి తనిఖీలకు వస్తానని, అప్రమత్తంగా ఉండాలని వైద్యులను హెచ్చరించారు.

వైద్యుల్లో మార్పు రావాలి

ధరూర్‌క్యాంప్‌లోని మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి చేరుకున్న యాస్మిన్‌బాషా.. గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అందరితోనూ మాట్లాడారు. జిల్లాలో 75 శాతం సిజేరియన్లు జరుగుతున్నాయని, ఇది మంచిపద్ధతి కాదని, సాధారణ ప్రసవాలు చేసేలా వైద్యుల్లో మార్పు రావాలని హెచ్చరించారు.

మంచి ఆహారం పెడుతున్నారా?

ఫుడ్‌సెక్షన్‌కు వెళ్లిన కలెక్టర్.. మెనూపై ఆరా తీశారు. మధ్యాహ్నం 12 గంటలు, రాత్రి 7 గంటలకు భోజనం పెడుతున్నామని సిబ్బంది బదులిచ్చారు. మెను ప్రకారం పేషెంట్లకు నాణ్యమైన భోజనం అందించాలని వారికి సూచించారు. మధ్యాహ్నం 1.20 – మధ్యాహ్నం 2.40 గంటల వరకు మాతా శిశు ఆస్పత్రిలో ఆమె తనిఖీలు చేశారు. అయితే, కలెక్టర్ వస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న వైద్యులు అప్రమత్తం కావడం గమనార్హం.

మూఢనమ్మకాలు వద్దు..

కొందరు గర్భిణులు ముహూర్తం చూసుకుని ప్రసవాలు చేయించుకుంటున్నారని, ఇది సరైన పద్ధతి కాదని, ఇట్లాంటి వాటిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆశ వర్కర్లకు సూచించారు. సిజేరియన్లతో భవిష్యత్‌లో ఆరోగ్యపరంగా తలెత్తే సమస్యలపై అవగాహన కల్పించాలని అన్నారు. సాధారణ ప్రసవాలతో కలిగే ప్రయోజనాల గురించి వివరించాలని చెప్పారు. ముఖ్యంగా ప్రైవేటు ఆస్పత్రుల్లో సిజేరియన్ల సంఖ్య పెరుగుతోందని, పద్ధతి మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సాధారణ ప్రసవం కోసం గర్భిణులు కొన్ని ఇబ్బందులు పడ్డా భవిష్యత్ బాగుంటుందని సూచించారు.

రైతు కుటుంబం నుంచి ఎస్పీ దాకా..

- బహుముఖ ప్రజ్ఞాశాలి ఎస్పీ భాస్కర్
- పట్టుదలతో లక్ష్యం సాధించారు

జగిత్యాలక్రైం: ఆయనది వ్యవసాయ కుటుంబం.. చిన్నతనం నుంచే ప్రతిభావంతుడు.. తొలుత ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు పాఠాలు బోధించారు.. అంతటితో ఆగకుండా సమాజ సేవవైపు దృష్టి సారించారు. గ్రూప్–1 పరీక్ష రాసి డీఎస్పీ కొలువు కొట్టేశారు. అంచెలంచెలుగా ఎదిగి ఎస్పీ స్థాయికి చేరుకున్నారు. ఇప్పుడు సమాజంలో శాంతిభద్రతలు కాపాడుతున్నారు. పట్టుదల ఉంటే సులభంగా నిర్దేశిత లక్ష్యం సాధించవచ్చంటున్నారు సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన ఎగ్గడి భాస్కర్. ఆయన తల్లిదండ్రులు లక్ష్మమ్మ – గురువయ్య. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు భాస్కర్. కుటుంబంలో ఆయనే చిన్నవారు.

డీఎస్సీ -2000లో టీచర్ కొలువుకు ఎంపిక..



భాస్కర్ 2000 డీఎస్సీలో ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. తొలుత నల్గొండ జిల్లా చింతలపల్లి మండలం ఓమన్‌తాళ్లపల్లి, తర్వాత తుంగతుర్తి మండలం అన్నారం, ఆ తర్వాత అర్వపల్లి మండలం కోడూరులో విద్యార్థులకు పాఠాలు బోధించారు.

2009లో గ్రూప్–1కు ఎంపిక..

సివిల్ సర్వీస్‌కు ప్రిపేర్ అవుతూనే 2009లో గ్రూప్–1 పరీక్ష రాశారు భాస్కర్. తొలిప్రయత్నంలోనే డీఎస్పీగా ఎంపికయ్యారు. అదేఏడాది గ్రూప్–2 రాసి రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంక్ సాధించారు. దీంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా రామగుండం డీఎస్పీగా, మెట్‌పల్లి ఎస్‌హెచ్‌వోగా శిక్షణ పొందారు.

తొలుత గుంటూరులో పోస్టింగ్..

తొలిపోస్టింగ్ గుంటూరు జిల్లా బాపట్ల. 2011–13 వరకు డీఎస్పీగా విధులు నిర్వర్తించారు. 2014–16 వరకు కామారెడ్డి, 2017లో ఆసిఫాబాద్‌లో డీఎస్పీగా విధులు పనిచేశారు. అదనపు డీసీపీగా పదోన్నతి పొంది హైదరాబాద్ ట్రాఫిక్‌కు బదిలీ అయ్యారు. 2021లో ఆన్ ప్రమోషన్‌పై హైదరాబాద్ ఇంటలిజెన్స్ ఎస్పీగా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం జగిత్యాల ఎస్పీగా పనిచేస్తున్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ భాస్కర్

సత్వర సేవలు అందిస్తాం..

- శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవడంతోపాటు బాధితుల నుంచి నేరుగా దరఖాస్తులు స్వీకరించి సత్వర సేవలు అందిస్తామని ఎస్పీ భాస్కర్ తెలిపారు.
- ఆపదలో ఉన్నవారు పోలీసుల సాయం కోసం డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు.
- మహిళల భద్రత కోసం షీటీమ్‌ను మరింత పటిష్టం చేసి అండగా నిలుస్తామని ఎస్పీ భాస్కర్ చెప్పారు.
- 1930 నంబరుకు ఫోన్‌చేసి సమాచారం అందిస్తే సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపుతామని అన్నారు.
- నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.
- గుర్తించిన ప్రాంతాల్లో సైన్‌బోర్డులు ఏర్పాటు చేస్తామని చెప్పారు.
- అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

తూకంలో వ్యత్యాసం ఉండొద్దు

జగిత్యాలరూరల్: రేషన్‌దుకాణాల్లోని సరుకుల్లో వ్యత్యాసం ఉంటే సంబంధిత డీలర్లపై చర్యలు తప్పవని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని రేషన్ దుకాణాలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. శీలం తిరుపతికి చెందిన రేషన్ దుకాణం నంబరు 2706026లోని సరుకుల్లో వ్యత్యాసం రావడంతో కేసు నమోదు చేశామని తెలిపారు. ప్రతీ దుకాణంలో స్టాక్‌బోర్డులు ఏర్పాటు చేయాలని, సమయపాలన పాటించాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కాగా, ఈనెల రేషన్ బియ్యం కోటా ఆలస్యంగా వచ్చిందని, దీంతో ఈనెల 8వ తేదీ నుంచి లబ్ధిదారులకు పంపిణీ ప్రారంభించామని ఆయన వివరించారు. డీటీవోలు వరప్రసాద్, ఆనంద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన సర్పంచులు


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సర్పంచులు

ధర్మపురి: జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన షేక్ యాస్మిన్‌బాషాను గురువారం ధర్మపురి మండల సర్పంచులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జైనా, కోస్నూర్‌పల్లె సర్పంచులు మహేష్, ఎన్నం లక్ష్మారెడ్డిలతో పాటు టీఆర్‌ఎస్ నాయకులు రమేష్,మల్లేష్ ఉన్నారు.

నూతన కార్యవర్గం


నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న రిటైర్డ్ ఎస్పీ

ధర్మపురి: మండంలోని నేరెల్ల గ్రామంలో గల శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. ఆలయ వ్యవస్థాపకుడు విశ్రాంత ఎస్పీ మాదాసు రమేష్‌బాబు ఆధ్వర్యంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మాదాసు రమేష్‌బాబు, అధ్యక్షుడు జంగిలి తిరుపతి, ఉపాధ్యక్షుడు కోల రామన్న, ప్రధాన కార్యదర్శులు ఇంద్రాల మల్లేశం, శ్యామల మధుకర్, తోగేటి సంతోష్, కార్యదర్శులు కాసారపు బాలాగౌడ్, కోల శంకర్, జుంజురు అశోక్, కోశాధికారి కటికెరెడ్డి ప్రభాకర్, ప్రధాన సలహాదారు వేముల రమేష్ తదితరులు ఎన్నికయ్యారు.

గుర్తుతెలియని మృతదేహం


కాలువలో గుర్తుతెలియని మృతదేహం

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామ శివారులోని ఎస్సారెస్పీ ప్రధాన కాలువలో గుర్తుతెలియని మృతదేహం నీటిలో కొట్టుకుపోయింది. గుర్తుతెలియని మృతదేహం కాలువలో కన్పించడంతో పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకునేసరికి వరద ప్రవాహంలో మృతదేహం కన్పించకుండా పోయింది. మృతదేహంపై తెలుపురంగు షర్టు ఉన్నట్లు స్థానికులు గుర్తించారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ


దొంగలు పగులగొట్టిన హుండీ

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డా రు. హుండీలో నగదుతో పాటు సీసీకెమెరాలను ఎత్తుకెళ్లారు. గ్రామస్తులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎక్కడికక్కడ.. అంతరాయం లేకుండా

- నాణ్యమైన కరెంట్ సరఫరాకు సబ్ స్టేషన్‌ల నిర్మాణం
- జిల్లాలో 117 విద్యుత్ సబ్‌స్టేషన్‌లు
- ప్రతిపాదనలో మరో రెండు


మోతె విద్యుత్ సబ్‌స్టేషన్

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో వ్యవసాయం, గృహ అవసరాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా విద్యుత్ శాఖ ముందుకెళ్తోంది. కరెంట్ సరఫరాలో నష్టాన్ని నివారించడం, లో వోల్టేజీ సమస్యలకు పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటుంది. జిల్లాలో ఇప్పటికే 117 విద్యుత్ సబ్ స్టేషన్లు పనిచేస్తుండగా, మరో రెండు ప్రతిపాదన దశలో ఉన్నాయి.

ఒక్కో సబ్ స్టేషన్‌కు..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో విద్యుత్ శాఖ ఎక్కడికక్కడే విద్యుత్ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తుంది. ఒక్కో సబ్ స్టేషన్ నిర్మాణానికి రూ.1.25 కోట్ల నుంచి రూ.1.50 కోట్ల వరకు వెచ్చిస్తుంది. గృహాలు, పరిశ్రమలు, వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తుండటంతో పంపిణీలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటుంది. కాగా ఇటీవల విద్యుత్ డిమాండ్ పెరగడంతో వ్యవసాయానికి ఇచ్చే త్రీఫేజ్‌లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యుత్ సరఫరాలో సబ్‌స్టేషన్‌లే కీలకం కావడంతో వాటి నిర్మాణానికి చర్యలు తీసుకుంటుంది.

మూడు నుంచి నాలుగుగ్రామాలకొకటి..

జిల్లాలో 33/11 కేవీ సబ్‌స్టేషన్లు 117 ఉన్నాయి. జగిత్యాల అర్బన్ మండలం 5, జగిత్యాల రూరల్ 8, రాయికల్ 6, సారంగాపూర్ 3, బీర్‌పూర్ 3, ధర్మపురి 7, బుగ్గారం 3, పెగడపల్లి 5, గొల్లపల్లి 5, మల్యాల 7, కొడిమ్యాల 4, కోరుట్ల 11, మెట్‌పల్లి 9, ఇబ్రహీంపట్నం 9, మల్లాపూర్ 8, కథలాపూర్ 7, మేడిపల్లి 9, వెల్గటూర్‌లో 8 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. మరో రెండు ధర్మపురి ఆలయం, రాయపట్నం పరిధిలో కొత్త సబ్‌స్టేషన్లు నిర్మించేందుకు స్థలాన్ని పరిశీలిస్తున్నారు. జిల్లాలో 380 గ్రామాలు ఉండగా, మూడు నుంచి నాలుగు గ్రామాలకొక సబ్‌స్టేషన్లు పనిచేస్తున్నాయి.

132/33 కేవీ సబ్‌స్టేషన్లు 8

జిల్లాలో 132/33 కేవీ సబ్‌స్టేషన్లు 8 ఉన్నాయి. జిల్లా కేంద్రంతో పాటు ధర్మపురి, రాయికల్, కోరుట్ల, కథలాపూర్ మండల కేంద్రాలు, కొడిమ్యాల మండలం పూడూరు, మెట్‌పల్లి మండలం గోధూర్, వెల్గటూర్ మండలం ఎండపల్లిలో ఉన్నాయి. సారంగాపూర్ మండలం పెంబట్ల–కోనాపూర్‌లో 220/132 కేవీ సబ్‌స్టేషన్ ఉంది.

సరఫరా ఇలా..

రామగుండం థర్మల్ స్టేషన్ నుంచి మొదట జిల్లాలోని పెంబట్ల–కోనాపూర్‌లో గల 220/132 కేవీ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా అవుతుంది. అక్కడి నుంచి ఎనిమిది 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లకు, వాటి నుంచి 33/11 కేవీ స్టేషన్‌లకు సరఫరా అవుతుంది. 33/11 కేవీ సబ్‌స్టేషన్ల కింద 11 కేవీ లైన్స్‌కు సంబంధించి దాదాపు 610 ఫీడర్లు ఉంటాయి. వాటి ద్వారా గ్రామాల్లోని డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌లకు వెళ్తుంది. ఇలాంటి జిల్లాలో 25 వేల వరకు ఉంటాయి. ట్రాన్స్‌ఫార్మర్‌ల కింద 43 వేల ఎల్‌టీ ఫీడర్‌లు ఉంటాయి. వీటి నుంచి ఇళ్లు, వ్యవసాయ బావులకు విద్యుత్ సరఫరా అవుతుంది.

పరిశీలనకు 263 మంది

సబ్‌స్టేషన్లలో విద్యుత్ సరఫరా పరిశీలనకు 263 మంది పనిచేస్తున్నారు. ఇందులో 233 మంది సబ్ స్టేషన్ ఆపరేటర్లు, 30 మంది వాచ్‌మెన్‌లు. వీరే కాకుండా ఎప్పటికప్పుడు విద్యుత్ పంపిణీ సంస్థకు చెందిన ఎస్‌ఈ, డీఈ, ఏడీ, ఏఈ, లైన్‌మెన్, హెల్పర్లు కూడా సబ్‌స్టేషన్లను పరిశీలిస్తుంటారు. కాగా ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజు పోయినా, విద్యుత్ సరఫరా నిలిచినా రైతులు ట్రాన్స్‌ఫార్మర్‌లపైకి ఎక్కి ప్రయోగాలు చేయవద్దని, విద్యుత్ సిబ్బంది, అధికారులకు సమాచారం ఇవ్వాలని పంచాయతీ కార్యాలయాల బోర్డులపై విద్యుత్ సిబ్బంది నంబర్లు రాయించడంతో పాటు కంట్రోల్ రూం నంబర్లను కూడా వెలువరుస్తున్నారు.

సబ్‌స్టేషన్ల నిర్మాణంతో..



ఎక్కడికక్కడే సబ్‌స్టేషన్లు నిర్మించడంతో సరఫరాలో ఇబ్బందులు లేవు. ఇటీవల డిమాండ్‌ను మించి విద్యుత్ వినియోగిస్తుండటంతో అధికారులు కోతలు పెడుతున్నారు. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లోవోల్టేజీ సమస్యతో మోటార్లు కాలిపోతాయనే బాధ కూడా లేదు.

– నక్కల రవీందర్‌రెడ్డి, అంతర్గాం, జగిత్యాల రూరల్

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం



నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అవసరమైన సబ్‌స్టేషన్లు నిర్మించాం. విద్యుత్ నష్టాలను వీలైనంత వరకు తగ్గించి, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నాం. విద్యుత్ సమస్యల పరిస్కారం కోసం జిల్లా, డివిజన్ కేంద్రాల్లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తున్నాం.

– జి.సత్యనారాయణ, ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ

పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించండి

జగిత్యాల: జిల్లాలో పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. గురువారం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకూడదని, ధరణికి సంబంధించిన దరఖాస్తులు, ఈ– ఆఫీసు పనులను వేగవంతం చేయాలన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ మకరంద్ పాల్గొన్నారు.

వాణిజ్య సంస్థలకు ఈసీబీసీ తప్పనిసరి

జగిత్యాల: వాణిజ్య సంస్థలకు ఎనర్జి కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ తప్పనిసరి అని మున్సిపల్ కమిషనర్ నరేశ్ అన్నారు. గురువారం కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ ఇంజనీర్లతో బ్యూరో ఆఫ్ ఎనర్జీ వారి ఆధ్వర్యంలో డిమాండ్ సైడ్ మేనేజ్‌మెంట్ స్కీంపై ట్రెనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఈసీబీసీ త ప్పనిసరి చేసిందని, నివాస భవనాలకు కోడ్ ఉంటుందన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా మేనేజర్ మోజాన్‌అలీ, డెప్యూటీ ఈఈ రాజేశ్వర్ పాల్గొన్నారు.

కారు ఢీకొని వృద్ధురాలు మృతి

గంగాధర(చొప్పదండి): మండలంలోని మధునగర్‌కు చెందిన ద్యావ వెంకవ్వ రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వెంకవ్వ బుధవారం సాయంత్రం తన కుమారుడు ద్యావ కొండయ్య ఇంటి నుంచి కిరాణం షాపులో వస్తువులను కొనుగోలు చేయడానికి రోడ్డు దాటుతుండగ కరీంనగర్ నుంచి జగిత్యాల వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్ర గాయాలైనాయి. వెంటనే కుటుంబసభ్యులు 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. మృతురాలి కుమారుడు అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వరిలో జింక్ లోపం, మొగిపురుగు బెడద


వరిపొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

సారంగాపూర్(జగిత్యాల): ప్రస్తుతం వరిలో జింక్ లోపంతో పాటు మొగిపురుగు బెడద ఎక్కువగా కనిపిస్తుందని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. గురువారం మండలంలోని లచ్చనాయక్‌తండా గ్రామంలో వరిపొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. వరిలో జింక్ లోపం కారణంగా పంట ఎదుగుదల లోపించి, ఆకులు ఎర్రబారడం, కుంగిపోవడం, ఆకులపై ముదురు గోధుమ రంగు మచ్చలు ఉండటం, ఆకు పెలుసుగా మారుతుందన్నారు. వరిలో మరో ప్రధాన సమస్య మొగిపురుగు (కాండం తొలిచే పురుగు) ఎక్కువ కనిపిస్తుందని దీని కారణంగా వరి కుదుళ్లు ఎండిపోయి నష్టం వస్తుందని తెలిపారు. అగ్గిలోపం సమస్య ఉందని నత్రజని అధికంగా వాడడం, రాత్రి ఉష్ణోగ్రత 20 డిగ్రీల కంటే తక్కువగా ఉండడంతో ఈ సమస్య ఏర్పడిందన్నారు. జింక్ లోపం నివారణకు జింక్‌సల్ఫేట్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి స్ప్రేచేయాలని సూచించారు. మొగిపురుగు నివారణకు ట్రి సైక్లజోల్‌లో 0.6 మిల్లీలీటర్లను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని, అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లజోల్ 0.6 మిల్లీలీటర్లు, లీటరు నీటిలో కలిపి స్ప్రేచేయాలని పేర్కొన్నారు. శాస్త్రవేత్తలు ఓం ప్రకాష్, రజనీకాంత్, రజని, గొనియా నాయక్, మండల వ్యవసాయాధికారి తిరుపతినాయక్, ఏఈవో వెంకటేష్ తదితరులు ఉన్నారు.

హామీలే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదు


మాట్లాడుతున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

- మంత్రి కొప్పులపై విరుచుకుపడ్డ అడ్లూరి

గొల్లపల్లి(ధర్మపురి): సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ వ్యవహార శైలి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందని, ఆయన హామీలే తప్ప ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని, రాష్ట్రానికి మంత్రివా లేదా ధర్మపురి నియోజకవర్గానికా అని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రశ్నించారు. హాత్‌సే హాత్ జోడో పాదయాత్రలో భాగంగా గొల్లపల్లిలో మాట్లాడారు. ధర్మపురిలోని గోదావరి నీటిని లిఫ్ట్ ద్వారా హరీశ్‌రావు హైదరాబాద్, సిద్దిపేట, సిరిసిల్లకు తీసుకెళ్తున్నారని, ఇక్కడి రైతుల పంట పొలాలు ఎండిపోతున్నా మంత్రి ఈశ్వర్ స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షలు విలువ చేసే భూములను రెవెన్యూ, పోలీసు అధికారులను అడ్డం పెట్టుకుని రైతులను భయభ్రాంతులకు గురిచేసి వారి నుంచి లాక్కుంటున్నారని ఆరోపించారు. సాంఘీక సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్నా కేవలం సీఎంఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులు ఇవ్వడానికి మాత్రమే ఉండటం సిగ్గుచేటన్నారు. రాహుల్‌గాంధీ జోడోయాత్రలో 4 వేల కి.మీ పాదయాత్ర చేశారని, దాని విజయలక్ష్యాలను కొనసాగింపుగా రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం వైఫల్యాలను, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు రేవంత్‌రెడ్డి హాత్‌సే హాత్ జోడోయాత్రను ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నిషాంత్‌రెడ్డి, సర్పంచులు సత్యనారాయణ, చిర్ర గంగాధర్, పురంశెట్టి వెంకటపద్మ వెంకన్న, సరసాని రాజ్యలక్ష్మి, తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ లంబ ధనవ్వ లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

పెళ్లి బస్సు.. ట్రాక్టర్ ఢీ

- నలుగురికి గాయాలు.. డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన పెను ముప్పు


దెబ్బతిన్న బస్సు ముందు భాగం


క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న సిబ్బంది

మల్యాల(చొప్పదండి): పెళ్లి బస్సు, ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. డ్రైవర్ అప్రమత్తతతో సమీపంలోని పొలాల్లోకి బస్సు దూసుకెళ్లి ఆగిపోవడంతో పెను ముప్పు తప్పింది. స్థానికుల వివరాలు.. గురువారం జగిత్యాల మండలం అంతర్గాం నుంచి పెగడపల్లి మండలం బతికెపల్లిలో జరుగుతున్న వివాహానికి బంధు మిత్రులతో బస్సు బయలుదేరింది. మల్యాల మండలం తక్కళ్లపల్లి శివారు మ్యాడంపల్లికి వెళ్లే దారిలో మూలమలుపు వద్ద ఎదురెదురుగా ట్రాక్టర్, బస్సు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బస్సు ముందుభాగం నుజ్జునుజ్జయింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో రోడ్డు పక్కన పొలాల్లోకి బస్సు ముందుభాగం వెళ్లి ఆగిపోయింది. అందులో ప్రయాణిస్తున్న జగిత్యాలకు చెందిన డ్రైవర్ షఫియొద్దీన్, క్లీనర్ ఫయాజ్‌తోపాటు మరో ఇద్దరు ఫాసిఖాన్, అమీర్‌ఖాన్‌లు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనా స్థలానికి ఎస్సై చిరంజీవి వెళ్లి బాధితులను 108లో జగిత్యాలకు తరలించారు. బాధితులకు 108 ఈఎంటీ జ్యోతి, పైలెట్ మహేశ్ ప్రాథమిక చికిత్స అందిస్తూ తరలించారు. ప్రమాదంపై ప్రాథమిక విచారణలో భాగంగా బస్సు డ్రైవర్‌ను బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించారు. ఎటువంటి రిమార్కు రాలేదని, డ్రైవర్ అప్రమత్తతతోనే పెను ప్రమాదం తప్పిందని ఎస్సై తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ పరారీలో ఉన్నారు.

ఏబీవీపీ నాయకుల ఆందోళన


ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

జగిత్యాల: జిల్లాలోని డిగ్రీ కళాశాలల్లో పరీక్ష ఫీజుల పేరిట విద్యార్థుల నుంచి అత్యధికంగా వసూలు చేస్తున్నారని ఏబీవీపీ నాయకులు కళాశాలల ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని, ఇప్పటికైనా యూనివర్సిటీ వారు అధిక ఫీజులు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. రాజు, అంజి, ప్రణయ్, నరేంద్ర, క్రిషాంత్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు


రోడ్డు ప్రమాద దృశ్యం

బుగ్గారం(ధర్మపురి): మండలంలోని వెల్గొండ ఎక్స్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. జగిత్యాలకు చెందిన సంజీవ్ అనే ఐస్‌క్రీం విక్రయదారుడు తన వాహనంతో జగిత్యాల వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మద్దెల గణేష్, వేముల శివమణి ద్విచక్రవాహనంపై జగిత్యాల వైపు వెళ్తూ వెల్గొండ ఎక్స్ రోడ్డు వద్ద ఐస్‌క్రీం బండిని వెనుక నుంచి బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో జగిత్యాలలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ధర్మపురి: పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడులు చేసి రూ.18,860 నగదు రెండు బైకులు, ఏడు ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. మండంలోని నాగారం గ్రామ శివారులో గురువారం సాయంత్రం కొందరు పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సీఐ కోటేశ్వర్ ఆధ్వర్యంలో ఎస్సై కిరణ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి దాడి చేయగా పేకాట ఆడుతున్నవారు పారిపోయారు. ఘటనా స్థలంలో నగదుతో పాటు బైకులు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్నవారిలో ధర్మపురి, నాగారం, కమలాపూర్ గ్రామాలకు చెందిన వారు ఉంటారని తెలుస్తోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బెడ్ పైనుంచి పడి బాలుడికి గాయాలు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఖిలాగడ్డ ప్రాంతంలో గల మైనార్టీ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థి బెడ్‌పై నుంచి కిందపడ్డాడు. విద్యార్థి మహ్మద్ ఫయాజొద్దీన్ గురువారం బెడ్‌పైనుంచి కిందపడటంతో ముక్కు, తలకు గాయాలయ్యాయి. దీంతో బాలుడి తల్లిదండ్రులు పాఠశాల నిర్వాహకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి


రామారావు మృతదేహం

తిమ్మాపూర్: నుస్తులాపూర్ గ్రామంలో ఓ రైతు విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. ఎల్‌ఎండీ పోలీసుల వివరాలు.. గ్రామానికి చెందిన రైతు తుమ్మనపల్లి రామారావు(70) గురువారం ఉదయం పొలంలో నాటు వేయించేందుకు కూలీలను తీసుకొని గ్రామ శివారులో ఉన్న మైసమ్మ మర్రి వద్దకు వెళ్లాడు. కూలీలు నాట్లు వేస్తుండగా మోటార్ ఆన్ చేసేందుకు బావి వద్దకు వెళ్లాడు. మోటార్ ఆన్‌చేసినా పనిచేయకపోవడంతో దానిని సరిచేసేందుకు యత్నించాడు. ఈ క్రమంలో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన సిరికొండ అంజన్ రావు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వెళ్లి పరిశీలించగా అప్పటికే చనిపోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రమోద్‌రెడ్డి తెలిపారు.

పీఆర్సీ కమిటీ వేయాలి


మాట్లాడుతున్న గంగరాజం

జగిత్యాల: పీఆర్సీకి ప్రభుత్వం వెంటనే కమిటీ వేయాలని పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు గంగరాజం అన్నారు. కార్యాలయంలో పెన్షనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ఉద్యోగుల హెల్త్ స్కీంపై ఇటీవల ప్రయత్నాలు చేయడం మంచిదేనని, అలాగే ఉద్యోగులకు, పెన్షనర్లకు రెండు కరువు భత్యాలు రావాల్సి ఉందన్నారు. ప్రతి నెలా 1వ తేదీనే పెన్షన్లు వేయాలన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి రవీందర్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కరీంనగర్‌క్రైం: భార్యతో విడాకులు కావడం, కూతురుకు దూరమవడంతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ పోలీసుల వివరాలు.. కట్టరాంపూర్‌కు చెందిన కామారపు విక్రం(38)కు సవరన్ స్ట్రీట్‌కు చెందిన వైష్ణవితో 2016లో వివాహం కాగా ఏడేళ్ల కూతురు ఉంది. భార్యాభర్తలకు మనస్పర్ధలు రావడంతో 2018లో విడాకులు అయ్యాయి. అప్పటి నుంచి విక్రం మనస్తాపానికి గురై పిచ్చిపిచ్చిగా ప్రవర్తించేవాడు. ప్రస్తుతానికి కోర్టు చౌరస్తా వద్ద గల ఒక వైన్స్‌లో పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం పనికి వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. అప్పుడు ఇంట్లో ఎవరూ లేరు. మనస్తాపానికి గురైన విక్రం తన గదిలోకి వెళ్లి ఉరేసుకొని మృతిచెందాడు. సాయంత్రం తల్లి ఇంటికి రాగా విక్రం ఉరేసుకొని కనిపించాడు. స్థానికుల సహాయంతో కిందికి దింపి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి జ్ఞానేశ్వర్ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.